ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే... 5 PM

మన సమగ్ర

# ప్రజావాణి

RNI NO:TGTEL/25/A5443

బుధవారం , సెప్టెంబర్, 02, 2026

తెలుగు డైలీ

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

https://epaper.prajavaani.net

### కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై

## బీఆర్ఎస్ ఛార్జిషీట్

### - విడుదల చేస్తున్న కేటీఆర్

**హైదరాబాద్ :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న తరుణంలో ప్రధాన ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి పార్టీ నేటి నుంచి వారం పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టనుంది. ఎన్నికల హామీల అమలును గుర్తు చేయడంతో పాటు పాలనా వైఫల్యాలపై ఆయా వర్గాల ప్రజలను భాగస్వామ్యుల్ని చేస్తూ నిరసనలు, ర్యాలీలు, సదస్సులు నిర్వహించనుంది. పోరుబాటకు ప్రారంభంగా తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంపై పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఛార్జ్‌షీట్‌తో పాటు లోగోను విడుదల చేస్తున్నారు. అటు ఆరు గ్యారెంటీల వైఫల్యాలపై నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, భారీ ఫ్లెక్సీల ప్రదర్శనతో పాటు ప్రజలకు బకాయి ఉన్న హామీలను గుర్తు చేస్తూ 'బాకీ కార్డుల' పంపిణీ చేపట్టనుంది. మూడో తేదీన రైతు సదస్సుల రూపంలో సాగునీరు, విద్యుత్, యూరియా, బీమా సమస్యలపై ఆందోళనలు నిర్వహిస్తారు. హైదరాబాద్‌లో 22ఏ నిషేధిత జాబితా భూ ముల సమస్యపై నిరసనలు చేపడతారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలు వైఫల్యంపై నిరసన కార్యక్రమాలు, 2,500 ఆర్థిక సాయం, ఖ.జ.= కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అంశాలు లక్ష్యంగా నాలుగో తేదీన మహిళలు, వికలాంగులతో ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తారు. హామీలు అమలు చేయని ప్రభుత్వానికి



నిరసనగా వంటావార్పు చేపడతారు.

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



**అమరావతి, సెప్టెంబర్ 02:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నేడు. ఆయనకు ఆయనకు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు ఈ శుభాకాంక్షలు తెలియజేశారు. 'మిత్రులు, జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. పవర్ స్టార్‌గా అభి మానుల గుండెల్లో చిరస్థాయిగా ఉండే శ్రీ పవన్ కల్యాణ్ ఆయురా రోగ్యాలతో నిండు నూరేళ్లూ వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షి స్తున్నాను'. 'పంచా యతీ రాజ్ శాఖలో అనేక సంస్కరణలతో, అభివృ ద్ది కార్యక్రమాలతో పెనుమార్పులు తెస్తున్నారు. గిరిజన ప్రజల కష్టా లు తీర్చేలా రోడ్ల నిర్మాణం నుంచి పచ్చదనం పెంపు వరకు ఆయన తీసుకుంటున్న చర్యలు ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయి. మార్పును ఆవిష్కరిస్తున్నా యి. రాష్ట్ర పునర్నిర్మాణం విషయంలో ప్రజలకు కూటమి ఇచ్చిన మాటను నిజం చేసేలా అనునిత్యం పనిచేస్తున్న పవన్ కల్యాణ్ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకునేలా ఆశీర్వదించాలని ఆ దేవదేవుడిని ప్రార్థిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### భూ భారతి రిజిస్ట్రేషన్లకు

## మోక్షం ఎన్నడు?




**హనుమకొండ:** స్లాట్ బుక్ చేసుకున్నాం.. సర్కారుకు చెల్లించాల్సిన చలాన్ల డబ్బులు ముందే కట్టాం.. అయినా రోజుల తరబడి తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాలా? అని రైతులు, భూ కొనుగోలుదారులు అధికారులను నిలదీస్తున్నారు. హనుమకొండ జిల్లాలోని ఆరు మండలాల్లో వేలేరు, పరకాల, కమలాపూర్, దామెర, ఐనవోలు, కాజీపేటలో భూ భారతి రిజిస్ట్రేషన్ల నిలిపివేత వెనుక కలెక్టరేట్ డి-సెక్షన్ సూపరింటెండెంట్ నాగరాజు తీసుకున్న అనాలోచిత నిర్ణయాలే కారణమన్న ఆరోపణలు తీవ్రమవుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్లిన వారు పనులను వదులుకొని వారం రోజులుగా రిజిస్ట్రేషన్ కోసం జిల్లాలో ఎదురుచూస్తున్నారు. ఆగస్టు 25 నుంచి 31 తేదీ సోమవారం వరకు పూర్తిగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత ఆపరేటర్లను విధుల నుంచి తొలగించిన అధికారులు, పోర్టల్‌లో వారి లాగిన్ ఐడీలను డిసేబుల్ చేయడంలో ఎందుకు ఆసల్యం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్త సిబ్బందికి ప్రత్యేక లాగిన్ ఐడీలు ఇవ్వడంలో నిర్లక్ష్యం ఎందుకని మండిపడుతున్నారు. పర్యవేక్షణ లోపంతో సాంకేతిక చిక్కులు తలెత్తుతుంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల మార్పిడి, కుటుంబ హక్కుల బదిలీ, వారసత్వ నమోదు, గిఫ్ట్ డాక్యుమెంట్లు, సేల్ డీడ్స్ వంటి అత్యవసర రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో వందలాది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీసుల చుట్టూ లేదా.. అని ప్రశ్నిస్తున్నారు.

### టీజీఎస్ఆర్టీసీలో 1500 కండక్టర్

# పోస్టుల భర్తీ

**హైదరాబాద్ :** 1000 రోజుల పాలనలో టీజీఎస్ఆర్టీసీ సాధించిన ప్రగతిని వివరించిన ప్రభుత్వంమహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.12,167 కోట్ల ఆర్థిక ప్రయోజనంసంస్థలోకి 2,932 కొత్త బస్సులు.. ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దపీటఉద్యోగులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు.. 4,538 పోస్టుల భర్తీకి చర్యలు ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేసిన మంత్రి పొన్నం తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా రవాణా శాఖ, టీజీఎస్ఆర్టీసీ సాధించిన ప్రగతిని ప్రభుత్వం వెల్లడించింది. ప్రజా రవాణాను బలోపేతం చేయడంతో పాటు మహిళలు, ప్రయాణికులు, కార్మికులకు మేలు చేసేలా అనేక సంస్కరణలు చేపట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సంస్థను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి గుర్తుచేశారు.




ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 347.36 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని, తద్వారా వారు రూ.12,167 కోట్ల ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని వివరించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమయ్యాక ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేటు 67శాతం నుంచి 89శాతానికి పెరిగిందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 600 బస్సులకు మహిళలనే యజమానులుగా చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా టీజీఎస్ఆర్టీసీలో భారీగా కొత్త బస్సులను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేయగా, అందులో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటికే రోడ్డెక్కాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలో మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు.

### రేవంత్ రెడ్డి ప్రభుత్వం

## సాధించిన ప్రగతి ఇదే

- ప్రజా వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన సాగిందన్న కవిత
- హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని మండిపాటు
- రాబోయే రోజుల్లో తెలంగాణలో మళ్లీ ప్రజల ప్రభుత్వమే వస్తుందని వ్యాఖ్య



**హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వెయ్యి రోజుల కాలం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు, నెరవేర్చని హామీలతోనే సాగిందని ఆమె ధ్వజమెత్తారు. గడిచిన వెయ్యి రోజుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల బతుకులను బాగు చేసింది ఏమీ లేదని, కేవలం కొందరి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిందని మండిపడ్డారు. హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం, సంక్షేమ గురుకులాల్లో భద్రత లేక విద్యార్థులు వరుసగా మరణించడం, జాబ్ నోటిఫికేషన్లు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం, పంటలకు మద్దతు ధర లేక అన్నదాతల బలవన్మరణాలు పెరిగిపోవడం.. వీటికి తోడు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి నేరాలు నిత్యకృ త్యం కావడమే ఈ ప్రభుత్వం సాధించిన అసలైన 'ప్రగతి' అని ఎద్దేవా చేశారు. ఉద్యమకారుల నెత్తురు చిందిన నాటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఈ సర్కార్ కాలం చెల్లిపోయిందని హెచ్చరించారు. ప్రభుత్వ అరాచకాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని, ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ ప్రజల ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

### 'తుమ్మిడిహెట్టి' నిర్మాణానికి సహకరించండి

## మహారాష్ట్రను కోరిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్ :** తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్రం కోరింది. 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణం వల్ల ముంపు పెద్దగా పెరిగేది ఉండదని తెలిపింది. దీని ద్వారా గ్రావిటీ ద్వారా కరవు పీడిత ప్రాంతానికి నీళ్లు వస్తాయని వివరించింది. అయితే ముంపుపై పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని మహారాష్ట్ర కోరడంతో 15 రోజుల తర్వాత భేటీ నిర్వహించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. 2 రాష్ట్రాల భేటీని నిర్వహించిన సీడబ్ల్యూసీ : ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణంపై దిల్లీలో కేంద్ర జలసంఘం ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి చొరవ చూపాలంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు లేఖ రాయడంతో రెండు రాష్ట్రాల భేటీని సీడబ్ల్యూసీ నిర్వహించింది. ఈ సమావేశంలో అధికారులు



పలు అంశాలపై చర్చించారు. మహారాష్ట్ర సహకారాన్ని కోరిన తెలంగాణ : ప్రాణహిత నదిపై 152 మీటర్ల వద్ద తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మించుకునేందుకు సహకరించాలంటూ మహారాష్ట్రను రాష్ట్రం కోరింది. గ్రావిటీ ద్వారా కరవు పీడిత ప్రాంతాలకు నీటిని తరలించుకునే వెసులుబాటు ఉంటుందని సూచించింది. గతంలో 148 మీటర్ల వద్ద చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఈ రెండు స్థాయిలోన్లూ ముంపు ప్రాంతంలో పెద్దగా వ్యత్యాసం లేదని ఆ రాష్ట్రానికి విన్నవించింది.

### వ్యవస్థలన్నింటినీ రేవంత్ రెడ్డి

# కుప్పకూల్చారు.

**హైదరాబాద్ :** కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. కేసీఆర్ కట్టిన ఇల్లు, పెట్టి న పొయ్యిలా రాష్ట్రాన్ని ఇస్తే.. రేవంత్ రెడ్డి వ్యవస్థలన్నింటినీ కుప్పకూల్చారని విమర్శిం చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో కలిసి మాజీ మంత్రి, శాసనసభా పక్ష ఉపనేత హరీశ్ రావు తెలంగాణ భవన్‌లో 'ఛార్జ్ షీట్'ను విడుదల చేశారు. పదేళ్ల పాటు కేసీఆర్ ఎంతో కష్టపడి దేశానికే తలమానికంగా తీర్చిదిద్దిన తెలంగాణ రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా కుప్ప కూలుస్తోందని, ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి ఈ ప్రజా వ్యతిరేక విధా నాలపై పోరాటం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం



అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆధ్వర్యంలో ఈరోజు కాంగ్రెస్ వైఫల్యాలపై 'ఛార్జ్ షీట్' విడుదల చేశామని తెలిపారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో జరిగిన అరాచకాలు, వ్యవస్థల నిర్వీర్యం, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ ఘోర వైఫల్యాలను ఎండగడుతూ ఈ ఛార్జ్ షీట్‌ను ప్రజల ముందు ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో బాండు పేపర్లు రాసిచ్చి, వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రజలను నమ్మబలికిన కాంగ్రెస్.. వెయ్యి రోజులు గడుస్తున్నా ఆ హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ఒక కొత్త రాష్ట్రాన్ని తన అపార అనుభవంతో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎంతో కష్టపడి అద్భుతంగా నిర్మించారని తెలిపారు. అనేక కార్యక్రమాలతో దేశం నేర్చుకునే విధంగా తొమ్మిదిన్నర ఏళ్లు గొప్ప పాలనను అందించారన్నారు. అది తాగునీటి రంగం కావచ్చు, సాగునీటి రంగం కావచ్చు.. ఏ రంగం చూసినా తెలంగాణను దేశానికే ఆదర్శంగా, తలమానికంగా కేసీఆర్ తయారు చేశారని అన్నారు. వ్యవసాయంలో అత్యధిక వరి ధాన్యం పండించిన రాష్ట్రంగా తెలంగాణను అగ్రగామిగా నిలిపారని కొనియాడారు.

# ప్రజావాణి కథనానికి స్పందన..

దగ్గరుండి పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న కార్యదర్శి, ఉప సర్పంచ్.




మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ RNI NO:TGTEL/25/A5443
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

రామచంద్రపురం తండాలో పడకేసిన పారిశుధ్యం.

- సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలు.
- సిబ్బందులతో పనిచేయించడంలో పూర్తిగా విఫలమైన గ్రామ సర్పంచ్, కార్యదర్శి.

epaper.prajavaani.net | 2026-09-02 | Page: 14
For more details, visit epaper.prajavaani.net

**హుజూర్నగర్ సెప్టెంబర్ 2 (ప్రజావాణి)**
"రామచంద్రపురం తండాలో పడకేసిన పారిశుధ్యం" అనే వార్త కథనానికి విశిష్ట స్పందన లభించింది. బుధవారం మఠంపల్లి మండల స్థాయి అధికారులు వెంటనే స్పందించి హుజూర్నగర్ నియోజకవర్గ మఠంపల్లి మండలంలోని రామచంద్రపురం లో పారిశుధ్యం సిబ్బంది సమస్యలను గ్రామ కార్యదర్శి లక్ష్మీపార్వతి ని అడిగి తెలుసుకుని, వెంటనే సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అందుబాటులో లేకపోవడంతో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో కార్యదర్శి లక్ష్మి పార్వతి గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశమై గ్రామంలోని సమస్యలను వాళ్ళ దృష్టికి తీసుకుని వెళ్లి, గ్రామ సిబ్బందులను గ్రామ పాలకవర్గం ఎదుట పిలిపించి పనులలో అలసత్వం వహించవద్దని సిబ్బందులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మీ వ్యక్తిగత సమస్యల వల్ల గ్రామ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు అందరూ కలిసి చేసుకోవాలని సూచించారు. ఇకమీదట ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చూసుకుంటామని, సిబ్బందితో గ్రామంలోని పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తానని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటానని కార్యదర్శి లక్ష్మీపార్వతి తెలిపారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ, వార్తలను అధికారుల దృష్టికి చేరవేస్తున్న "ప్రజావాణి" దినపత్రిక కు రామచంద్రపురం మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సర్పంచ్ వరలక్ష్మి సాగర్.

**ఐదు వేల ఆర్థిక సహాయం....**
**ఎల్లవేళల కుటుంబానికి అండగా హామీ**



**మద్దూరు సెప్టెంబర్ 2, ప్రజా వాణి,**
సిద్దిపేట జిల్లా దూలిమిట్ట మండలంలోని జాల పల్లి గ్రామంలో ఇటీవల కాలంలో పాశికంటి విట్టల్ అనారోగ్యంతో మృతి చెందారు. బుదవారం వారి కుటుంబాన్ని పరామర్శించి 5వేల రూపాయలు ఆర్థిక సాయం స్థానిక మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూడా విఠల్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో బి అర్ ఎస్ పార్టీ దూలిమిట్ట మండల నాయకులు చొప్పరి సాగర్ మరియు గ్రామ ప్రజలు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

# పేదల గుండెల్లో చెరగని ముద్ర.. వైఎస్సార్

**సంక్షేమ పాలనకు చిరునామాగా నిలిచిన మహానేతకు ఘన నివాళి**
**66వ డివిజన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా 17వ వర్ధంతి కార్యక్రమం**



**హసన్‌పర్తి, సెప్టెంబర్ 2:**పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన సాగించిన మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి (వైఎస్సార్) ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని హసన్‌పర్తి 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్రె కిరణ్ కుమార్ అన్నారు.వైఎస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా గొర్రె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో 66వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్ హయాంలో పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తుచేశారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన వైఎస్సార్ సేవలు తెలుగు ప్రజల మనసుల్లో ఎప్పటికీ చెరగని ముద్రగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.వైఎస్సార్ చూపిన సంక్షేమ బాట, ప్రజా సేవా స్ఫూర్తి నేటి తరానికి కూడా ఆదర్శమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారుభారీగా పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులుఈ కార్యక్రమంలో హసన్‌పర్తి 66వ డివిజన్ కాంగ్రె పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎస్సీ, బీసీ, మైనారిటీ, మహిళా నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు, పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# ఈ వాన కాలంలో సన్న వరి సాగు చేసిన రైతులు సెప్టెంబర్ 10 లోపు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలి...

**మండల వ్యవసాయ శాఖ అధికారి బి. రామకృష్ణ**



**మద్దూరు సెప్టెంబర్2, ప్రజా వాణి,**
ఈ వాన కాలంలో సన్న వరి సాగు చేసిన రైతులు సెప్టెంబర్ 10 లోపు ఎక్కడైతే డీలర్ దగ్గర కొనుగోలు చేశారు వారి దగ్గర ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలనీ మండల వ్యవసాయ శాఖ అధికారి బూరెల రామకృష్ణ రైతులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాలు బిపిటి-5294, కెఎన్ఎం-1638, అర్ఎన్అర్-15048 హెచ్ ఎం టి సోనా, వరంగల్-44, కెఎన్ఎం-7715, జై శ్రీరామ్,సాగు చేసే రైతులకు మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన బోనస్ 500/- వర్తిస్తుందన్నారు.. రైతు ఏ డీలర్ వద్ద కొనుగోలు చేశారు ఆ డీలర్ వద్ద బిల్ రసీదు చూపెట్టి నమోదు చేసుకోవాలన్నారు.రైతు తన సొంతంగా లేదా ఇంకో రైతు నుండి మరియు ఇతర పరిశోధన స్థానం ల నుండి ఏడు రకాల విత్తనాలు తీసుకొచ్చి సాగు చేసినట్లయితే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి స్వీయ ధృవీకరణ పత్రం ,పట్టాదారు పాస్బుక్ ,ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలుఇచ్చి ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా ఆన్లైన్లో నమోదు చేయుటకు చివరి తేదీ 10 సెప్టెంబర్ 2026

# ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పాలన చేసిన ప్రజానేత స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి

- **పేద మధ్యతరగతి ప్రజలకోసము ఆరోగ్య శ్రీ లాంటి పథకాన్నీ అమలు చేసిన మహా నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి**
- **హిరమండల రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించిన ఘనత రైతు బండవుడూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి**
- **పలాస ప్రజావాణి ప్రతినిధి**
- **పలాస లో స్వర్గీయ మాజీ ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సభ జరిగింది ..**



**ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు**
మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు.వైఎస్సార్ పాలనలో పేదలకు సంక్షేమ పథకాలను విస్తృతంగా అందించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.గత రెండున్నరేళ్లుగా గ్రామాల్లో అర్హులైన అనేక మందికి కొత్త పెన్షన్లు అందడం లేదని అప్పలరాజు ఆరోపించారు. ప్రభుత్వం మూడు లక్షల కొత్త పెన్షన్లు ప్రకటించినప్పటికీ, పంచాయతీల వారీగా చూస్తే ఒక్కో పంచాయతీకి కేవలం 10 నుంచి 20 పెన్షన్లు మాత్రమే అందుతున్నాయని విమర్శించారు.అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు.వైఎస్సార్ హయాంలో 108,104 సేవలు,ఆరోగ్యశ్రీ వంటి పథకాలు పేదలకు ఎంతో ఉపయోగపడ్డాయని గుర్తుచేశారు.,వంశధార ఫేజ్-2, హిరమండలం రిజర్వాయర్ వంటి అభివృద్ధి పనులకు వైఎస్సార్ హయాంలోనే ప్రాధాన్యత లభించిందన్నారు. అదేవిధంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్,జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆఫ్‌షోర్ ప్రాజెక్టు,మూల పేట పోర్టు,బుడగట్ల పాలెం హార్బర్,కిడ్నీ రీసెర్చ్ హాస్పిటల్ వంటి ప్రాజెక్టులు ముందుకు సాగాయని గుర్తు చేశారు.వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల విషయంలో ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని ఆయన తప్పుబట్టారు.వైఎస్సార్,జగన్ ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తించాల ని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హనుమంతు వెంకట రావు మాస్టర్,వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యదన రావు, పలాస మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు , తదితరులు పాల్గొన్నారు

# ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్



**బెజ్జంకి, సెప్టెంబర్ 2 (ప్రజావాణి)**
తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ నాలుగో మహాసభలు సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ తెలిపారు.మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో కార్మికులతో కలిసి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించి కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.కనీస వేతనం రూ.26 వేలు, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు హమాలీ, భవన నిర్మాణ, ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కరీంనగర్‌లో జరిగే మహాసభలకు ఏఐటీయూసీ జాతీయ నాయకులు హాజరవుతారని, బెజ్జంకి మండలంలోని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకటరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పండుగ పరశురాములు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్‌తో పాటు రాములు, బాలయ్య, సమ్మయ్య, కొమురయ్య, లచ్చ య్య, , ప్రభాకర్, తిరుపతి పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాలలను ఇతర శాఖల పరిధిలోకి మార్చొద్దు

**సాంకేతిక విద్యా మండలి పరిధిలోనే కొనసాగించాలి: ఎయిడసో డిమాండ్**




**వరంగల్, సెప్టెంబర్ 2:** రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా నైపుణ్యాల విశ్వవిద్యాలయం పరిధిలోకి తీసుకురావాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎయిడసో) ఆధ్వర్యంలో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద విద్యార్థులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా నైపుణ్యాల విశ్వవిద్యాలయం పరిధిలోకి తీసుకురావాలనే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను ఇతర శాఖలు లేదా సంస్థల పరిధిలోకి మార్చకుండా తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి పరిధిలోనే కొనసాగించాలని కోరారు.పాలిటెక్ని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర సాంకేతిక విద్యా మండలిని మరింత బలోపేతం చేయాలని అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోధనా, బోధనేతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రయోగశాలలు, పనిముట్ల శాలలు, తరగతి గదులు, వసతి గృహాలు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. విద్యార్థుల విద్యా భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాలను విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా నిపుణులతో చర్చించిన తర్వాతే అమలు చేయాలని సూచించారు.ప్రధాన డిమాండ్లు పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా నైపుణ్యాల విశ్వవిద్యాలయం లేదా ఇతర శాఖల పరిధిలోకి మార్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. పాలిటెక్నిక్ కళాశాలలను తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి పరిధిలోనే కొనసాగించాలి. ఖాళీగా ఉన్న బోధనా, బోధనేతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలి కళాశాలల్లో ప్రయోగశాలలు, పనిముట్ల శాలలు, తరగతి గదులు, వసతి గృహాలు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలి. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలపై విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా నిపుణులతో చర్చించాలి.ఈ నిరసన కార్యక్రమంలో జస్వంత్, వినీత్, దర్శిత్, చరణ్, రుషిత్, రామ్ చరణ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.
"పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి సాంకేతిక విద్యా మండలిని బలో పేతం చేయాలి" అని ఎయిడసో నాయకులు ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. కె. వెంకటేష్వరంగల్ జిల్లా కార్యదర్శి, ఎయిడసో

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com